
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 20 । జూన్ । 2025



సోమశిలలో 36.40 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 36.40 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 4705 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,02,390
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,273
3 శాతం జీఎస్టీతో	రూ.9,551
నవర (8 గ్రా)	రూ.76,408

గరిష్ఠం/కనిష్ఠం
37.4 /30.0

వాతావరణం

జిల్లాలో ఉష్ణోగ్రతలు శుక్రవారం సాధారణంగానే ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 47 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

యోగా దినోత్సవానికి పక్కాగా ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, జేసీ

నెల్లూరు రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను పక్కాగా చేపట్టామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను అమరావతిలోని సచివాలయం నుంచి సీఎం చంద్రబాబు గురువారం నిర్వహించారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్ నుంచి వర్చువల్‌గా హాజరైన కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని ఏడు వేల ప్రదేశాల్లో సామూహిక యోగా కార్యక్రమాలను నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో దాదాపు పది వేల మందితో సామూహిక యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని వెల్లడించారు. జేసీ కార్తీక్, నోడల్ ఆఫీసర్ యతిరాజ్, డీఈఓ బాలాజీరావు, జెడ్పీ సీఈఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ దిష్టిబొమ్మ దహనం



నెల్లూరు (టౌన్): జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల విక్రయాలను వెంటనే నిలిపేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హేమంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. అధిక ఫీజులు, పుస్తకాల విక్రయాన్ని నిరసిస్తూ నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఎదుట డీఈఓ దిష్టిబొమ్మను గురువారం దహనం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు, పుస్తకాలను విక్రయిస్తున్నా, డీఈఓ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. నేతలు సుకుమార్, రాబర్ట్, మానీష్, మదన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


లాసెట్ ఫలితాల విడుదల

నెల్లూరు (టౌన్): ఏపీ లాసెట్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. పద్మావతి మహిళా విద్యాలయ ఆధ్వర్యంలో పరీక్షను ఈ నెల ఐదున నిర్వహించారు. మూడేళ్ల కోర్సుకు 543 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 458 మంది హాజరుకాగా, 453 మంది అర్హత సాధించారు. ఐదేళ్ల కోర్సుకు జిల్లా వ్యాప్తంగా 107 మంది దరఖాస్తు చేసుకోగా, 91 మంది హాజరయ్యారు. వీరిలో 88 మంది అర్హత సాధించారు.

సమస్యల పరిష్కారానికి సబ్ డివిజన్ డ్రైవ్

నెల్లూరు రూరల్: జిల్లాలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం తదితరాలను పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు గానూ ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్‌ను చేపట్టామని జేసీ కార్తీక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నామమాత్రపు దరఖాస్తు రుసుము రూ.50ను సంబంధిత గ్రామ సచివాలయాల్లో చెల్లిస్తే జాయింట్ పట్టాదారుల భూములను ఉచితంగా సబ్ డివిజన్ చేయనున్నామని వివరించారు. అర్హులైన రైతులు ఈ నెల 30లోపు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిహారమివ్వాలని వినతి



మాట్లాడుతున్న రైతులు

నెల్లూరు(అర్బన్): దగదర్తిలో విమానాశ్రయ పేరిట చేపట్టిన భూసేకరణలో తమకు పరిహారాన్ని అందజేయాలని మండలంలోని దామవరం రైతులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని గురువారం అందజేసిన అనంతరం గ్రామ సర్పంచ్ నిమ్మకాయల ప్రసాద్ మాట్లాడారు. తమ గ్రామంలో దశాబ్దాలుగా ప్రభుత్వ సివాయి, డీకేటీ పట్టా భూములను 172 మంది దళిత, బీసీలు సాగు చేసుకుంటున్నారని చెప్పారు. భూ వివరాలు అధికారిక రికార్డుల్లోనూ ఉన్నాయని చెప్పారు. భూసేకరణలో వీటిని కోల్పోతున్నామని, పట్టా భూములు కాకపోవడంతో పరిహార విషయాన్ని అధికారులు పట్టించుకోవడంలేదని చెప్పారు. న్యాయమైన పరిహారాన్ని అందించాలని కోరారు. దావా విజయమ్మ, తుమ్మల దినేష్, మాధవరావు, జయప్రకాష్, మందా శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసులతో కాకాణిపై కుట్ర

రిమాండ్ నుంచి రెండు నెలల పాటు రాకూడదు

- కూటమి పెద్దల స్కెచ్
- గ్రావెల్ తవ్వకాలు, టోల్‌గేట్, మద్యం.. ఇలా రోజుకొకటి తెరపైకి
- మండల స్థాయి నేతలనూ వదలడంలేదు
- పోలీసుల తీరుపై భగ్గుమంటున్న అభిమానులు

కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనను ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయించి.. రెడ్‌బుక్ రాజ్యాంగంతో వారిని వేధిస్తూ పైశాచికానందాన్ని టీడీపీ పొందుతోంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అరాచక పాలన.. వారి అవినీతిని నిరంతరం ప్రశ్నిస్తూ.. ప్రజల్లో మమేకమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై రోజుకో కేసు మోపి అనేక ఇబ్బందులకు గురిచేస్తోంది. గ్రావెల్ తవ్వకాలు.. టోల్‌గేట్.. మద్యం.. ఇలా లేనివన్నీ తెరపైకి తీసుకొచ్చి నిత్యం ముప్పుతిప్పలు పెడుతోంది.



నెల్లూరు రైల్వే కోర్టులో విచారణకు హాజరై.. వెళ్తున్న కాకాణి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జెడ్పీ చైర్మన్‌గా.. సర్వేపల్లి నియోజకవర్గానికి రెండుసార్లు ఎమ్మెల్యేగా.. మంత్రిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ అభివృద్ధికి బాటలేశారు. అధికారం కోల్పోయాక.. కూటమి ప్రభుత్వ వేధింపులపై ఏ మాత్రం బెదరకుండా.. వారి అవినీతి, అక్రమాలను ఎండగడుతూ వచ్చారు. ఇది నచ్చని సర్కార్ పెద్దలు ఆయనపై కక్షగట్టారు. ఇంకేముంది.. ప్రభుత్వ యంత్రాంగం తమ చెప్పుచేతల్లో ఉండటంతో ఎడాపెడా అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపి.. వికటాట్టహాసం చేస్తున్నారు. అక్రమ మైనింగ్ చేయించారంటూ కేసు నమోదు చేసి రిమాండ్‌లో ఉంచిన పోలీసులు.. ఆయన్ను మరో రెండు నెలల పాటు బయటకు రానీయకుండా తాజాగా నాలుగు కేసులు బనాయించి పీటీ వారెంట్లను సిద్ధం చేస్తున్నారు. ఒక్క కేసులోనూ బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారు. తాజాగా ఆయనతో పాటు నియోజకవర్గంలోని ముఖ్య అనుచరులనూ ఇరికించడం వారి కుతంత్రానికి ఉదాహరణగా నిలుస్తోంది.

మాకెదురొస్తావా..!

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి వారి వైఫల్యాలతో పాటు స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అవినీతి, అక్రమాలను నిరంతరం ఎండగడుతూ వచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించిన సమయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీస్ శాఖ తీరును తప్పుబట్టేవారు. ఈ పరిణామాలు రుచించని ఎమ్మెల్యే, ప్రభుత్వ పెద్దలు ఆయన్ను టార్గెట్ చేశారు. సర్కారు ఏర్పాటైన ఐదు నెలల్లో ఏడు కేసులు నమోదు చేయించారు.

వింతపోకడ

నిజానికి పత్రికల్లో ప్రచురితమైన వార్తల క్లిప్పింగులను వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వార్డ్ చేయడమనేది సర్వసాధారణం. అదేదో అపరాధంగా భావించి.. అనుకున్నదే తడవుగా వెంకటాచలం, ముత్తుకూరు, వేదాయపాళెం, కావలి పోలీస్‌స్టేషన్లలో నాలుగు కేసులు బనాయించారు. పార్టీ పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమాలకు హాజరయ్యారనే కారణంతో మరొకటిని నమోదు చేసి విచారణకు పిలిచారు. అయితే ఇవన్నీ బెయిలబుల్ కిందికొచ్చేవి కావడంతో పొదలకూరు మండలం రుస్తుం మైన్‌లో అక్రమంగా మైనింగ్ చేశారంటూ మరో కేసును నమోదు చేశారు.

జీఓ ఇచ్చినా.. మాకు పట్టదు

వెంకటాచలం మండలంలోని కనుపూరు చెరువులో మట్టి తవ్వకాలకు నాటి టీడీపీ ప్రభుత్వం జీఓ నంబర్ 40ను జారీ చేసింది. దీనికి అనుబంధంగా రైతుల అవసరాల నిమిత్తం 2019, 24లో జీఓలను గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విడుదల చేసింది. ఆయకట్టు రైతుల భూములకైతే క్యూబిక్ మీటర్‌కు రూపాయి చొప్పున.. అదే వాణిజ్యావసరాల నిమిత్తం రూ.231 చొప్పున ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెల్లించేలా పొందుపర్చారు. ఈ తరుణంలో వీటి మేరకే తవ్వకాలు జరిగాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇవన్నీ మారిపోయాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ తవ్వకాలను జరిపారని, పది లక్షల క్యూబిక్ మీటర్లను వాణిజ్యావసరాలకు తరలించి రూ.25 కోట్లను స్వాహా చేశారంటూ స్థానిక టీడీపీ నేత వల్లూరు రమేష్‌నాయుడి ద్వారా ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేశారు. ఇందులో కాకాణి, వెంకటాచలం మాజీ జెడ్పీటీసీ మండల వెంకటశేషయ్య, నిరంజన్‌రెడ్డిపై కేసులు బనాయించారు.

కనికట్టు.. వారికే చెల్లు

గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం పోర్టు వద్ద లారీ ఓనర్స్, కంటైనర్, కృష్ణపట్నం లాజిస్టిక్ అసోసియేషన్లను ఏర్పాటు చేసి.. ట్రాన్స్‌పోర్టు వాహనాల ద్వారా వసూలు చేశారని, రవాణా చార్జీలను అధికంగా పెంచి సొంత అవసరాలకు వాడుకున్నారంటూ ముత్తుకూరు బీసీ కాలనీకి చెందిన టీడీపీ మద్దతుదారుడు, ట్రాన్స్‌పోర్టర్ ఫరీద్ ద్వారా ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేశారు. ఇదంతా కాకాణి ప్రోద్బలంతోనే జరిగిందని చెప్తూ.. ఆయన్ను ఏ – 1గా చూపి కేసు మోపారు. పార్టీ నేతలు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, తూపిలి శ్రీధర్‌రెడ్డి, స్వామి బాలాజీ ట్రాన్స్‌పోర్ట్స్, వెంకటశేషయ్య, నెల్లూరు ప్రసాద్, రాగాల వెంకటేశ్వర్లు, పొట్టి రాజా, సాయికిరణ్‌తో పాటు మరికొందర్నీ చూపారు.

మద్యం కేసును తిరగదోడి..

గత ఎన్నికల సమయంలో ముత్తుకూరు మండలం పంటపాళెం, పొదలకూరు మండలం విరువూరులో మద్యం కేసులు పట్టుబడ్డాయి. అప్పట్లో వీటిని ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకొని, విరువూరులో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. వీటిపై అధికారులు చార్జిషీట్‌ను దాఖలు చేయడంతో ముగిశాయి. తాజాగా ఈ రెండింటినీ తిరగదోడారు. అప్పట్లో బెదిరించి, చంపబోయారంటూ పొదలకూరు మండలానికి చెందిన విజయ్‌బాబు ద్వారా ఫిర్యాదును స్వీకరించి, కోర్టు అనుమతితో స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఇందులో కాకాణితో పాటు మండల స్థాయి నేత సురేష్‌కుమార్‌తో పాటు మరికొందరి పేర్లు ఇరికించారు. ఇవి ఎక్సైజ్ శాఖ పరిధిలో ఉన్నా, పోలీస్ అధికారులు వారితో సంతకాలు చేసేలా యత్నిస్తున్నారు. కాకాణిపై ప్రభుత్వ కక్షసాధింపుపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

తెరపైకి రోజుకో కేసు

అక్రమ మైనింగ్ కేసులో నెల్లూరు సెంట్రల్ జైల్లో ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న కాకాణిని మరో రెండు నెలల పాటు బయటకు రానివ్వకుండా అడ్డుకోవాలనే ధ్యేయంతో మరో ఐదు అక్రమ కేసులను ప్రభుత్వ పెద్దలతో పాటు పోలీసులు బనాయించారు. సోమిరెడ్డి ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యంగ్య చిత్రాలను వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వార్డ్ చేశారని.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని ఎమ్మెల్యే అనుచరుడు మేకల సురేంద్ర ఫిర్యాదు మేరకు మంగళగిరిలోని సీఐడీ కార్యాలయంలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ వ్యవహారంలో గుంటూరు కోర్టులో హాజరుపర్చగా, 14 రోజుల రిమాండ్ విధించి నెల్లూరు సెంట్రల్ జైలుకు పంపారు.

బెయిల్ రాకుండా చూడటమే లక్ష్యంగా..

కేసులోని ముగ్గురికి హైకోర్టు ముందస్తు బెయిలిచ్చింది. ఏ – 4గా ఉన్న కాకాణికి బెయిల్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా మరో కొత్త కుట్రను తెరపైకి తెచ్చారు. మైన్‌లో జిలెటిన్ స్టిక్స్ లాంటి పేలుడు పదార్థాలను ఉపయోగించారని.. ప్రభుత్వ సొమ్మును కొల్లగొట్టారని.. అట్రాసిటీ కేసును బనాయించి జైలుకు పంపారు. కాగా ఇదే కేసులో ఏ – 5గా ఉన్న టీడీపీ నేతను మాత్రం విచారణకు ఇప్పటికీ పిలవలేదు.

4 వరకు జ్యుడీషియల్ రిమాండ్

నెల్లూరు (లీగల్): కృష్ణపట్నం పోర్టు సమీపంలో చెక్‌పోస్టును పెట్టి డబ్బు వసూలు చేశారనే అక్రమ కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి జూలై మూడు వరకు జ్యుడీషియల్ రిమాండ్‌ను విధిస్తూ ఉత్తర్వులను నెల్లూరు మొదటి తరగతి స్పెషల్ రైల్వే జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పాలంగళం వినోద్ గురువారం జారీ చేశారు. గతంలో ముత్తుకూరు పోలీసులు అక్రమ కేసును బనాయించారు. ఈ క్రమంలో పీటీ వారెంట్‌తో జిల్లా సెంట్రల్ జైలు నుంచి రైల్వే కోర్టుకు కాకాణిని తీసుకొచ్చి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. ప్రభుత్వం తరపున ఏపీపీ లీలాకుమారి.. కాకాణి పక్షాన న్యాయవాదులు రోజారెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి వాదనలు వినిపించారు. వీరి వాదనలు విన్న అనంతరం కేసులో ఉన్న ఐపీసీ 409 సెక్షన్‌ను తొలగిస్తూ జ్యుడీషియల్ రిమాండ్‌కు ఉత్తర్వులిచ్చారు. అనంతరం కాకాణి తరపున బెయిల్ పిటిషన్‌ను న్యాయవాదులు రోజారెడ్డి, సిద్ధన సుబ్బారెడ్డి దాఖలు చేశారు.

ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా

నెల్లూరు (లీగల్): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ముత్తుకూరు పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో ముందస్తు బెయిల్‌పై విచారణ నెల్లూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టులో గురువారం జరిగింది. కేసు డైరీ రాకపోవడంతో స్పెషల్ పీపీ అభ్యర్థన మేరకు కేసు విచారణను ఈ నెల 23కు వాయిదా వేస్తూ న్యాయమూర్తి శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు.

- కాకాణిపై వెంకటాచలం పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ నెల్లూరు నాలుగో అదనపు జిల్లా కోర్టులో విచారణకు వచ్చింది. కేసు డైరీ కోర్టుకు రాకపోవడంతో స్పెషల్ పీపీ అభ్యర్థన మేరకు కేసు విచారణను ఈ నెల 24కు వాయిదా వేస్తూ న్యాయమూర్తి శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రొసీడింగ్స్‌పై హైకోర్టు స్టే

నెల్లూరు (లీగల్): సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టు పెట్టారంటూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై గుంటూరు సీఐడీ పోలీసులు అక్రమ కేసు బనాయించారు. ఈ కేసులో వారెంట్‌పై గుంటూరు ఆరో అదనపు ప్రత్యేక సీబీసీఐడీ కోర్టులో ఇటీవల హాజరుపర్చగా, ఈ నెల 23 వరకు రిమాండ్‌ను విధించారు. కాగా తనపై అక్రమ కేసును రాజకీయ కక్షతో బనాయించారంటూ హైకోర్టులో తన న్యాయవాది మనోహర్‌రెడ్డి ద్వారా పిటిషన్‌ను దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణరావు ఈ కేసులోని అన్ని ప్రొసీడింగ్స్‌ను నిలిపేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

నర్రవాడలో కోలాహలం

- ముగిసిన వెంగమాంబ బ్రహ్మోత్సవాలు
- చివరి రోజు పొంగళ్ల సమర్పణ



అమ్మవారి గ్రామోత్సవం

దుత్తలూరు: నర్రవాడలో కొలువైన వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాల్లో భాగంగా పొంగళ్లను మహిళలు భక్తిశ్రద్ధలతో గురువారం పొంగించారు. ఉత్సవాల్లో చివరి రోజు కావడంతో అమ్మవారి దర్శనార్థం భక్తులు ఉదయం నుంచే బారులుదీరారు. పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. భక్తులు తమ వాహనాలకు పూజలు చేయించారు. హోమగుండంలో ఎండు కొబ్బరి వేసి మొక్కులు చెల్లించుకున్నారు. నర్రవాడ, గుదేవారిపాళెం, ఉలవవారిపాళెంలో గ్రామోత్సవాన్ని జరిపారు. పుట్టకు నమస్కరించి పూజలు చేశారు. అమ్మవారికి పుట్టింటి చీర, సారెను మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి సాయంత్రం తీసుకొచ్చారు. ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాకర్ల సురేష్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అడుగడుగునా నిలువుదోపిడీ

బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు అడుగడుగునా నిలువు దోపిడీకి గురయ్యారు. రూ.50కు విక్రయించాల్సిన టెంకాయ సెట్‌ను రూ.100కు.. దీన్ని కొట్టేందుకు రూ.20ను వసూలు చేశారని భక్తులు ఆరోపించారు. కిలో ఎండుకొబ్బరిని రూ.350కు విక్రయించి, తూకాన్ని సక్రమంగా పాటించలేదు. ప్రశ్నించగా, తాము పాట పాడుకున్నాం.. ఇంతే గిట్టుబాటవుతుందనే సమాధానమిస్తున్నారని భక్తులు ఆరోపించారు. అధికారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరించారు.



పొంగళ్లు పొంగిస్తున్న మహిళలు

ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు



వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎడ్ల బండలాగుడు పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. తెలంగాణలోని హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రరెడ్డి ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేష్‌యాదవ్.. ప్రొద్దుటూరుకు చెందిన ద్వారసిల గురివిరెడ్డి.. వేటపాళేనికి చెందిన అత్తోటి శిరీషాచౌదరి, శివకృష్ణచౌదరి.. నంద్యాల జిల్లా గోసుపాడుకు చెందిన హేత్విక్‌రెడ్డి, దినేష్‌రెడ్డి.. ప్రొద్దుటూరుకు చెందిన మార్తాల చంద్ర ఓబుల్‌రెడ్డి.. మార్కాపురానికి చెందిన నక్షత్రారెడ్డి.. బేస్తవారిపేటకు చెందిన నాగశివశంకర్.. యర్రగొండపాళేనికి చెందిన దూదేకుల పెదచాంద్‌బాషాకు చెందిన ఎడ్ల జతలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. వీరికి వరుసగా రూ.70 వేలు, రూ.60 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.పది వేల నగదు బహుమతులతో పాటు షీల్డులను అందజేశారు. ఇందులో రూ.80 వేలను దేవస్థానం వారు, మిగిలిన మొత్తాన్ని పలువురు దాతలు అందజేశారు. బీజేపీ నేత మేకపాటి మాల్యాద్రి, ఈఓ ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సరుకుల రవాణాలో అన్యాయం



లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతల నిరసన

కోవూరు: సివిల్ సప్లయ్స్ గోదాములకు సరుకుల రవాణాలో తమకు అన్యాయం జరుగుతోందని లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. సాలుచింతల సమీపంలోని గోదాముల సముదాయ ఎదుట నిరసనను గురువారం చేపట్టిన అనంతరం నేతలు కొండస్వామినాయుడు, ఖదీర్‌బాషా మాట్లాడారు. అసోసియేషన్‌లో సుమారు రెండు వేల మంది లారీ యజమానులు సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. అయితే ఇటీవలి కాలంలో కాంట్రాక్ట్ ముసుగులో తమను పక్కనబెట్టడంతో పాటు ఇతరులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. గతంలో కుదిరిన ఒప్పందం మేరకు 3:7 నిష్పత్తిలో తమకు పని కేటాయించాల్సి ఉందని, అయితే ప్రస్తుతం దీన్ని పక్కనబెట్టి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోయినా, ప్రజలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో తక్కువ బాడుగకే లారీలను తిప్పామని తెలిపారు. నంద్యాలకు చెందిన ఓ కాంట్రాక్టర్ ముందుకు రాకపోయినా, ఆయనకే అధికారులు ప్రాధాన్యమివ్వడం బాధాకరమని చెప్పారు. గతంలో చేసిన రవాణా సేవలకు సంబంధించిన బకాయిలను నేటికీ చెల్లించలేదన్నారు. శ్రీనివాసులురెడ్డి, షఫీ, వెంకటరమణయ్య, జయరామిరెడ్డి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాలలో విజిలెన్స్ విచారణ



కావలి (జలదంకి): కావలి ఏరియా వైద్యశాలలో రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అధికారులు తనిఖీలను గురువారం చేపట్టారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారి బీసీకే నాయక్, డీఎస్‌హెచ్ స్పెషలిస్ట్ మాజీ దాబీ, డీఎస్‌హెచ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సురేష్‌చంద్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ భార్గవ, సెక్షన్ ఆఫీసర్ రంగనవ్య తనిఖీలు చేపట్టి.. రికార్డులను పరిశీలించారు. పలువురు సిబ్బందిని విచారించి వివరాలను ఆరాతీశారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీకి, వైద్యాధికారుల మధ్య సమన్వయం లేకపోవడం.. హాస్పిటల్లో అత్యవసర పనులు చేపట్టి నిధులు దుర్వినియోగం చేయడం.. తదితరాలపై విచారణ జరిపారు. జనరల్ ఫిజీషియన్ కర్నాటి రోహిత్ వ్యవహార శైలిపై సైతం విచారణ జరిగిందని సమాచారం. హాస్పిటల్‌కు చెందిన కొన్ని దుకాణాల లావాదేవీలపై సైతం విచారణ చేపట్టారు. సూపరింటెండెంట్ పద్మావతి, ఆర్‌ఎంఓ ప్రమీల తదితరులను అనుమతించకపోవడంతో ఉత్కంఠ వాతావరణం కనిపించింది. విచారణ రాత్రి వరకు కొనసాగింది.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి రెండో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటీఐ జిల్లా కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని.. ఏ కళాశాలలో చేరాలనుకుంటున్నారో అక్కడ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను 17లోపు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వ ఐటీఐల్లో వచ్చే నెల 21, 22న.. ప్రైవేట్‌కు సంబంధించి 23, 25న కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నామని వెల్లడించారు.

క్లుప్తంగా

సంయుక్తంగా స్వచ్ఛాంధ్ర, యోగా కార్యక్రమాలు

• కలెక్టర్ ఆనంద్



నెల్లూరు రూరల్: ఈనెల 21వ తేదీ 3వ శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవంతో పాటు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను సంయుక్తంగా నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. ఆరోజు ఉదయం 6:30 నుంచి 8:30 గంటల వరకు వార్డు నుంచి జిల్లా స్థాయి వరకు ఎంపిక చేసిన ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా చేయాలన్నారు. ఆ కార్యక్రమం ముగిశాక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్ని సచివాలయాలు, పార్కులు, కార్యాలయాల్లో, పాఠశాలల్లో మొక్కలు నాటాలన్నారు. యోగా, స్వర్ణాంధ్ర కార్యక్రమాలపై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు పెట్టాలన్నారు. కార్యక్రమాల్లో ఎక్కడా ప్లాస్టిక్ వాడకుండా క్లాత్ మ్యాట్స్ వినియోగించాలన్నారు. అధికారులు, ప్రజలు, స్వయం సహాయక సంఘ మహిళలు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్దఎత్తున రెండు కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తుండగా..

• నాలుగు వాహనాల పట్టివేత



గుంతలో చికెన్ వ్యర్థాల పూడ్చివేత

వెంకటాచలం: చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న నాలుగు వాహనాలను మత్స్యశాఖ అధికారులు బుధవారం రాత్రి వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద పట్టుకున్నారు. వివరాలు.. గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు చికెన్ వ్యర్థాలతో వాహనాలు వెళ్తున్నాయని మత్స్యశాఖ అధికారులకు కొందరు సమాచారం అందించడంతో వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించారు. నాలుగు దోస్త్ వాహనాలను గుర్తించి వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచాలని తొలుత ప్రయత్నించారు. అయితే కొందరు ఈ వీడియోలు తీసి బయటపెట్టడంతో గురువారం చికెన్ వ్యర్థాలను వెంకటాచలం సమీపంలోని అడవిలో గుంత తవ్వి పూడ్చిపెట్టారు. కేసు నమోదు చేశారు.


బీసీలకు ఏం చేశారు?



మాట్లాడుతున్న నిర్మల

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైంది. ఈ కాలంలో సీఎం చంద్రబాబు బీసీలకు ఏం చేయలేదు' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల అన్నారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రభుత్వం బీసీ మహిళలకు ఎటువంటి సహాయం చేయలేదన్నారు. మేము అధికారంలోకి వస్తే బీసీ కార్పొరేషన్‌కు పూర్తి స్థాయిలో నిధులు కేటాయిస్తామని చెప్పిన కూటమి నాయకులు ఏడాది గడిచినా ఇంత వరకు చేసేందేమీ లేదన్నారు. 18 సంవత్సరాల వయసు నిండిన మహిళలకు నెలకు రూ.1,500లు ఇస్తామని చెప్పారని, ఆ నగదు కోసం వారంతా ఎదురు చూస్తున్నారన్నారు. గత జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ఎన్నో కుటుంబాలను ఆదుకున్నట్లు చెప్పారు.

కలిగిరి ఎస్సైకి తప్పిన ప్రమాదం



దెబ్బతిన్న కారు

దుత్తలూరు: వెంగమాంబ బ్రహ్మోత్సవాల విధులు ముగించుకుని ఇంటికెళ్తున్న కలిగిరి ఎస్సై ఉమాశంకర్ ప్రమాదం నుంచి బయటపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. కలిగిరి ఎస్సైగా పని చేస్తున్న ఉమాశంకర్ నర్రవాడలోని వెంగమాంబ బ్రహ్మోత్సవాల విధులకు హాజరయ్యారు. ఈ క్రమంలో గురువారం విధులు ముగించుకుని కారులో తానే స్వయంగా డ్రైవింగ్ చేస్తూ కలిగిరి వెళ్తున్నారు. మండలంలోని బండకిందపల్లి సమీపంలోకి వచ్చేసరికి కారు ముందు చక్రం పేలిపోయింది. దీంతో వాహనం పల్టీలు కొట్టి రోడ్డు పక్కన పడిపోయింది. అటువైపుగా వెళ్తున్న వారు గమనించి ఎస్సైని కారులో నుంచి బయటకు తీశారు. ఆయన ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 35.956 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,330, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

అంతా గందరగోళం



డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద గుమిగూడిన ఏఎన్‌ఎంలు, వారి సహాయకులు

- ఆందోళన నడుమ ఏఎన్‌ఎంల రీకౌన్సెలింగ్
- డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ఉద్రిక్తత
- అర్హత లేని వారు సిఫార్సు లేఖలు తెచ్చుకున్నారు
- కలెక్టర్‌కు గోడు వెళ్లబోసుకున్న నర్సులు
- వైద్యశాఖాధికారులపై ఆగ్రహం

నెల్లూరు(అర్బన్): ఆఫీస్ బేరర్ల పేరుతో యూనియన్ల నాయకుల సిఫార్సుల లేఖలు.. కోర్టు తీర్పు.. అర్హులకు అన్యాయం.. కలెక్టర్‌ను కలిసిన ఏఎన్‌ఎంలు.. జిల్లా వైద్యశాఖ కార్యాలయం వద్ద ఆందోళనలు.. ఇలా గందరగోళ పరిస్థితుల నడుమ గురువారం ఏఎన్‌ఎంల బదిలీల రీకౌన్సెలింగ్ జరిగింది.

అందువల్లే..

యూనియన్ల ఆఫీస్ బేరర్లకు నాయకులు లెటర్లు ఇస్తే వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఉంటుంది. వాస్తవానికి బుధవారమే ఏఎన్‌ఎంల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేసి ఆర్డర్లు కూడా ఇచ్చేశారు. ఇందులో ఏపీ ఎన్జీఓ, ఏపీజీఈఏ నేతల సిఫార్సుల లేఖలను వైద్యశాఖాధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. అయితే హంస (హెల్త్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ సర్వీసెస్ యూనియన్) నాయకులను పట్టించుకోలేదు. దీంతో హంస నాయకులు కోర్టుకెళ్లారు. వారి లేఖలను పరిగణించాలని తీర్పునివ్వడంతో బుధవారం జరిగిన కౌన్సెలింగ్‌ను రద్దు చేసి మళ్లీ నిర్వహించారు.

సీటు వదల్లేక..

బదిలీలకు సంబంధించి జీఓలో కొన్ని నిర్దిష్టమైన అంశాలున్నాయి. 9 ఏళ్లు ఒకే స్టేషన్‌లో పనిచేసి ఉంటే యూనియన్ల నాయకుల లేఖలు చెల్లవు. అయితే నేతలు తమవారి కోసం 10 ఏళ్లు, 12 ఏళ్లు, 15 ఏళ్ల సర్వీసున్న వారికి కూడా సిఫార్సు లేఖలిచ్చారు. దీంతో నగరానికి సమీపంలో వారు పనిచేస్తున్న చోట నుంచి బదిలీ జరగలేదు. వీరికి ఎక్కువగా హెచ్‌ఆర్ వస్తుండటంతో తమ సీటును వదిలేందుకు ఇష్టపడకుండా యూనియన్ల నాయకుల లెటర్లు తెచ్చుకున్నారు. ఈ వ్యవహారంలో నేతలు రూ.20 వేలకు పైగా ఒక్కో లెటర్‌కు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. ఉదాహరణకు జగదేవి పీహెచ్‌సీలో ఓ ఏఎన్‌ఎం 19 సంవత్సరాల నుంచి అక్కడే పనిచేస్తున్నప్పటికీ ఆమెకు ప్రాధాన్యత లేఖను ఇచ్చారు. జొన్నవాడ పీహెచ్‌సీ పరిధిలోని వవ్వేరు సబ్ సెంటర్‌లో ఓ ఏఎన్‌ఎం 15 ఏళ్లుగా పని చేస్తున్నా ఆమెకు యూనియన్ నాయకులు సిఫార్సు లేఖ ఇచ్చారని మిగిలిన ఏఎన్‌ఎంలు పేర్కొంటున్నారు. అలాగే చెల్లాయపాళెం సబ్‌సెంటర్, పెద్దాస్పత్రిలో పీపీ యూనిట్‌లో 10 ఏళ్లుగా పనిచేస్తున్న వారు లెటర్లు తెచ్చుకున్నారు.

మా పాత్ర ఉండదు

వైద్యశాఖాధికారి డాక్టర్ సుజాత మాట్లాడుతూ కౌన్సెలింగ్‌లో మా ప్రభావం ఉండదన్నారు. యూనియన్ల నాయకులు కలెక్టర్‌కు సిఫార్సులకు సంబంధించి పేర్లు ఇచ్చారని తెలిపారు. అక్కడి నుంచి వచ్చిన జాబితా ప్రకారం ప్రాధాన్యం కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, ఇందులో తమ పాత్ర ఏమీ ఉండదన్నారు. అంతేకాకుండా రాష్ట్ర ఉన్నతాధికారులు కౌన్సెలింగ్‌ను జరపమన్నారని అందువల్ల ప్రక్రియను పూర్తి చేస్తున్నామన్నారు. దీనికి ఏఎన్‌ఎంలు ఒప్పుకోకుండా నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలోనే 200 దరఖాస్తులకు సంబంధించి 47 సిఫార్సుల లేఖలకు ప్రాధాన్యం కల్పించి బదిలీలు చేశారు. దీంతో అర్హులకు అన్యాయం జరిగింది.

> **ఆందోళన చేసి..**
>
> లేఖల్ని చూసిన ఏఎన్‌ఎంలు తమకు అన్యాయం జరిగిందంటూ కౌన్సెలింగ్ జరిగే నెల్లూరులోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ ప్రక్రియను రద్దు చేసి సిఫార్సుల లేఖలు పరిశీలించి మళ్లీ జరపాలని నినదించారు. ఈ నేపథ్యంలో లేఖలు తెచ్చుకున్న వారికి.. నష్టపోతున్న ఏఎన్‌ఎంలకు వాగ్వాదం జరిగింది. ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పలువురు ఏఎన్‌ఎంలు కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను కలిసి తమకు అన్యాయం చేస్తున్నారంటూ గోడు వెళ్లబోసుకున్నారు. మొత్తం 200 మందిలో 71 మందికి యూనియన్ల నాయకులు సిఫార్సుల లేఖలిచ్చారని తెలిపారు. వారికి తొలి ప్రాధాన్యం ఇస్తే జిల్లా కేంద్రానికి దూరంగా ఎక్కడో మారుమూల గ్రామంలో 10, 15 ఏళ్లకు పైగా పనిచేస్తున్న తమకు దగ్గరికి వచ్చేందుకు ఇక అవకాశమే ఉండదని వివరించారు. నాయకులు అర్హత లేని వారికి లెటర్లు ఇవ్వడమే ఇందుకు కారణమని తెలిపారు. దీంతో కలెక్టర్ ఆనంద్ వైద్యశాఖాధికారులకు ఫోన్ చేసి నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్ జరపాలన్నారు. వీలైతే వాయిదా వేసి లోపాలు సరి చేసి మళ్లీ జరపాలంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.


నేడు రెవెన్యూ డే

నెల్లూరు(అర్బన్): రెవెన్యూ డే సందర్భంగా శుక్రవారం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు. కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌లు పర్యవేక్షణలో ఇవి జరుగుతాయి. ఈ సందర్భంగా ఆ శాఖల సేవలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నీటి పన్ను, అడంగళ్, వన్‌బీ, ప్రభుత్వ భూములు, దేవాలయ భూములు, వక్ఫ్ భూములు తదితర అంశాలపై వివరిస్తారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానిస్తారు. ప్రస్తుతం సేవలో అత్యుత్తమ పనితీరు చూపుతున్న రెవెన్యూ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలిస్తారు.

> **అరుదైన అవకాశం**
>
> ప్రజలు సేవల చేసే అరుదైన అవకాశం రెవెన్యూ శాఖ ఉద్యోగులకు దక్కుతుంది. ప్రజల్లో రెవెన్యూ శాఖ పట్ల నమ్మకాన్ని మరింత పెంచేందుకు కృషి చేస్తాం. భవిష్యత్‌లో ఇంకా జవాబుదారీగా, పారదర్శకమైన పాలన అందించేందుకు రెవెన్యూ దినోత్సవం ద్వారా ప్రభుత్వం మాకు ఒక అవకాశం కల్పించింది. దీనిని కాపాడుకుంటాం. జిల్లాలో రెవెన్యూ డేను నిర్వహించేందుకు సహకరించిన కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు కృతజ్ఞతలు.
>
> – అల్లంపాటి పెంచలరెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

గెలుపెవరిదో..

- బార్ అసోసియేషన్ ఎన్నికలు నేడు
- బరిలో మూడు ప్యానెల్స్
- ఓట్ల సంఖ్య 1,362



నెల్లూరు(లీగల్): నెల్లూరు న్యాయస్థానాల సముదాయంలోని న్యాయవాద సంఘం (బార్) ఎన్నికలు శుక్రవారం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేశారు. బ్యాలెట్ పత్రాలు, కౌంటింగ్ ప్రక్రియకు కావాల్సిన సామగ్రి తదితరాలను అందుబాటులో ఉంచినట్లు ఎన్నికల అధికారి బి.శ్రీనివాసన్ గురువారం తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. 1,362 మంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇదేరోజు సాయంత్రం ఏడు గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఎన్నడూ లేని విధంగా ఈసారి వీసీఎస్ఆర్ న్యాయవాదుల ప్యానెల్, న్యాయవాదుల ఐక్య వేదిక, జాతీయ న్యాయవాద వేదిక ప్యానెల్‌కు చెందిన అభ్యర్థులు పోటీలో తలపడుతున్నారు.

బరిలో ఉన్నవారు

అధ్యక్ష పదవికి పి.అయ్యపరెడ్డి, డి.రాజేంద్రప్రసాద్, వి.ఉపేంద్రరావు, ఉపాధ్యక్ష పదవికి ఈ.భాస్కరయ్య, జి.పద్మాకర్, బీఎస్ రంగరాజన్, జనరల్ సెక్రటరీ పదవికి ఎస్.అంకయ్య, ఎన్.నాగరాజు, సీహెచ్ నవీన్, జాయింట్ సెక్రటరీ పదవికి టి.బాబురెడ్డి, కేవీఎల్ నారాయణ, ఎన్.రవికృష్ణ, ఇండిపెండెంట్ అభ్యర్థిగా వి.ఈశ్వర్ మనోజ్‌కుమార్, ట్రెజరర్ పదవికి జి.రమేష్ పగడాల, డి.పెంచల ప్రణీత్, ఆర్.శివశంకరరావు, లైబ్రరీ కార్యదర్శి పదవికి ఎండీ ముజిబుర్ రెహిమాన్, ఎన్.నాగశ్రీనివాస్, ఎస్‌కే రషీద్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శి పదవికి పి.భాస్కర్‌రావు, జి.చంద్రశేఖర్ నాయుడు, ఎస్‌డీ వసీం, లేడీ రెప్రెజెంటేటివ్‌గా బి.కృష్ణవేణి, బి.లక్ష్మమ్మ, పి.రమాదేవి బరిలో ఉన్నారు. కార్యనిర్వాహక సీనియర్ విభాగం (ఈసీ)లో మూడు పోస్టులకు తొమ్మిది మంది, కార్యనిర్వాహక జూనియర్ విభాగం (ఈసీ)లో ఐదు పదవులకు 15 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. పోలింగ్ పూర్తై ఫలితాలు వెలువడేందుకు మరి కొద్దిగంటలే ఉండటంతో న్యాయవాదుల్లో ఉత్కంఠ నెలకొంది.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

• అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు గౌస్



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు గౌస్

నెల్లూరు(బృందావనం): పెన్షనర్ల ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని, తాత్సారం తగదని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఎస్ఎం గౌస్ తెలిపారు. నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్స్ భవనంలో గురువారం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కాలం గడిచినా డీఆర్, పీఆర్సీ బకాయిల పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఆ దిశగా ఆలోచన చేయాలన్నారు. రానున్న జూలై 4వ తేదీన జరిగే సమావేశం వివరాలను గౌస్ వివరించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్పీవీఎస్ మూర్తి మాట్లాడుతూ జీఓ నంబర్ 315 ద్వారా కుటుంబ పెన్షన్ పొందే విడో, డైవర్స్‌డ్ కుమార్తెల అర్హతలపై వివరించారు. పొదలకూరు శాఖ అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు పెన్షనర్లు స్పౌజ్ పేరు నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అసోసియేషన్ కోశాధికారి హజరత్తయ్య ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన ఆర్థిక నివేదికను సమర్పించారు. ఆదాయ పన్ను వివరాలను విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఖాజారసూల్ వివరించారు. మధు గ్యాస్ట్రో హాస్పిటల్ అధినేత డాక్టర్ డి.మధుసూదన్ గ్యాస్ట్రిక్, న్యూరాలజీ తదితర సమస్యలపై అవగాహన కలిగించారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.శ్రీనాథ్, కార్యనిర్వాహక కార్యదర్శి సీహెచ్ రఘునాథ్, ఉపాధ్యక్షులు మస్తానయ్య, ఖాసిం, గోపాల్, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పెన్షనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

22న నెల్లూరులో విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు

నాయుడుపేట టౌన్: విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 22న నెల్లూరులో ఉద్యోగుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్టు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, పెంచల ప్రసాద్ తెలిపారు. వారు గురువారం నాయుడుపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, సచివాలయాల్లో పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్ – 2 ఉద్యోగుల ప్రధాన సమస్యలపై సదస్సులో చర్చిస్తామన్నారు. అలాగే సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లకు విద్యుత్ సంస్థ నియమ, నిబంధనలను అమలు చేయాలని, వారిని విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతి, నాదముని రెడ్డి, జేఎల్ఎం ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్, అంబటి సుధీర్ బాబు, కంట్లాం రామయ్య, నజీబ్ ఖాన్ పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.30
సన్నవి	రూ.20
పండ్లు	రూ.10

రామయ్య మృతికి సంతాపం

కందుకూరు: పట్టణానికి చెందిన ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ అధినేత డాక్టర్ కంచర్ల రామయ్య (68) అనారోగ్యంతో హైదరాబాద్‌లో గురువారం మృతిచెందారు. ఆయన మృతికి పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. వలేటివారిపాళెం మండలం అత్తింటివారిపాళెం గ్రామానికి చెందిన రామయ్య మొదట్లో జర్నలిస్టుగా పనిచేశారు. తర్వాత కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట వద్ద ఇంజినీరింగ్ కాలేజీని స్థాపించారు. ఆయన రెండో కుమారుడు కంచర్ల శ్రీకాంత్ ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

• కలెక్టర్ ఆనంద్



పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

నెల్లూరు(పొగతోట): మట్టినమూనాలను సేకరించి, వాటిని పరీక్షించి ఎటువంటి పంటలు సాగు చేయాలో రైతులకు ముందుగానే అవగాహన కల్పించాలని కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. గురువారం నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో రైతులకు యంత్ర పరికరాలను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 – 25 సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా సుమారు రూ.6.80 కోట్ల విలువైన 1,452 పరికరాలను రాయితీపై అన్నదాతలకు అందజేస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి రూ.2.86 కోట్లు సబ్సిడీ అందుతుందని తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులు అవగాహన పెంచుకుని పంటలు సాగు చేయాలన్నారు. ఇందుకోసం వ్యవసాయాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ప్రాంతీయంగా రైతులకు ఉపయోగపడే పనిముట్లను రూపొందించాలని, పరిశోధన కేంద్ర అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారిణి సత్యవాణి, ఆగ్రోస్ రీజినల్ మేనేజర్ విద్యాసాగర్, సహాయ వ్యవసాయ శాఖ సంచాలకులు, రైతులు పాల్గొన్నారు.

పాలకుల మాటలు.. నీటి మూటలు



దెబ్బతిన్న రామలింగాపురం అండర్ బ్రిడ్జి రహదారి

నెల్లూరు(బారకాసు): నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామంటూ కూటమి నేతలు మాటలు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మరోలా ఉన్నాయి. నిత్యం వేలాది వాహనాలు తిరిగే రహదారులు మరమ్మతులకు గురైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో వాహనదారులు ప్రయాణ సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని రామలింగాపురం వద్ద ఉన్న అండర్ బ్రిడ్జి రోడ్డు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యాడు. గతంలో వేసిన సిమెంట్ రోడ్డుపై తారు రోడ్డు వేశారు. కొంతకాలానికే వేసిన తారు లేచిపోవడంతో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

బస్‌పాస్‌ల కోసం పడిగాపులు



ప్రధాన బస్టాండ్ వద్ద క్యూలో విద్యార్థులు తదితరులు



వేచి ఉన్న విద్యార్థులు



పిల్లాడిని తీసుకొచ్చి..

నెల్లూరు సిటీ: జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు బస్‌పాస్‌ల కోసం ఆర్టీసీ డిపోల్లో పడిగాపులు కాస్తున్నారు. నెల్లూరు నగరంలోని డిపో–1, డిపో–2లో బస్‌పాస్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఆత్మకూరు, కావలి, కందుకూరు, ఉదయగిరి, రాపూరు బస్ డిపోల్లో కూడా పెట్టారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో డిపోల వద్దకు వచ్చి గంటల తరబడి వేచిచూస్తున్న పరిస్థితులున్నాయి. ఇప్పటి వరకు కొత్త బస్‌పాస్‌లను 187 మంది తీసుకోగా, రెన్యువల్‌కు సంబంధించిన పాస్‌లను 900 మంది వరకు తీసుకున్నారని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. కాగా ఆన్‌లైన్‌లో కూడా పాస్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.